# వేమన శతకము

## (తాత్పర్య సహితము)

***అన్నింటిలోను ఘనమైన వాటి గురించి తెలుపుతుంది.***

**ఆ. అన్నిదానములను నన్నదానమె గొప్ప**
**కన్నతల్లికంటే ఘనములేదు**
**ఎన్నగురునికన్న నెక్కుడు లేదయా**
**విశ్వదాభిరామ వినురవేమా. *1***

***తా.*** అన్నింటికంటే ఘనమైనది అన్నదానము. ఎన్ని దానములు చేసిన అసంతృప్తితో ఉన్నవారు అన్నము దానము చేయుటతోనే సంతుష్టులు అవుతారు. కన్నతల్లి కంటే లోకములో ఉత్తమమైనది, ఉన్నతమైనది మరేదీ లేదు. జ్ఞానము ప్రసాదించు గురువు కంటే మించినవారు ఎవరూ లేరు. ఇవి నిత్య సత్యాలు.

***సహజమైన భావాలను మార్చలేమని తెలుపుతుంది***

**ఆ. ఎలుకతోలుఁదెచ్చి యేడాది వుతికిన**
**నలుపు నలుపేగాని తెలుపురాదు**
**కొయ్యబొమ్మ దెచ్చి కొట్టనఁబలుకునా**
**విశ్వదాభిరామ వినురవేమా. *2***

***తా.*** ఎవరి స్వభావాలను మార్చుట ఎవరి తరము కాదు. అని తెలుపుట దీని భావములోని అంతర్యము. ఎలుకతోలు నల్లగా ఉంటుంది. దానిని ఒక ఏడాదిపాటు ఉతికినను అది తెల్లబడదు. చెక్క బొమ్మను ఎంత బాదిన దానికి ఎటువంటి ప్రభావము ఉండదు.

***ఏ పనియందైననూ ఏకాగ్రత అవసరమని ఈ పద్యం తెలుపుతుంది.***

*ఆ.* *ఆత్మశుద్ధి లేని యాచారమదియేల?*
*భాండశుద్ధి లేని పాకమేల?*
*చిత్తశుద్ధి లేని శివపూజలేలరా?*
*విశ్వదాభిరామా వినురవేమ.* ***3***

***తా.*** మనసు నిర్మలతో లేనపుడు ఏ పని చేసిన అది వ్యర్థమే అగును. అపరిశుభ్రముగా వున్న పాత్రలో వంట చేసినచో అది శరీరమునకు మంచిదికాదుగదా. అదేవిధంగా నిశ్చలమైన మనస్సుతో చేయని భగవంతుని పూజలు కూడా ఎలాంటి ఫలితాలనివ్వవు.

***పైపై మెరుగులు చూసి మోసపోవద్దు అంటూ చెపుతుంది ఈ పద్యము.***

*ఆ.* *మేడిపండుచూడ మేలిమై యుండు*
*పొట్టవిప్పిచూడఁబురుగులుండు*
*పిరికివాని మదిని బింకమీలాగురా*
*విశ్వదాభిరామ వినురవేమా.* ***4***

***తా.*** నిగనిగలాడుతూ కనిపించే మేడిపండు బయటికి చూచుటకు చాలా చక్కగా కనిపించును. కాని దాని పొట్టవిప్పిచూస్తే లోపల పురుగులుండును. అదేవిధంగా చెడ్డవాడు పైకి బాగానే కనిపించినప్పటికి, సందర్భం వచ్చినపుడు వాడి గుణం బయటపడి చెడ్డవిగ తెలియును.



***చేసిన మేలు చిన్నదయినా అది గొప్పది అని తెలుపుతుంది.***

*ఆ.* *చిత్త శుద్ధి కలిగి చేసిన పుణ్యంబు*
*కొంచెమైన నదియుఁకొదువకాదు*
*విత్తనంబు మఱ్ఱివృక్షంబునకు నెంత*
*విశ్వదాభిరామ వినురవేమా.* ***5***

***తా.*** మఱ్ఱి వృక్షము చూసిన ఎంత విస్తరముగా ఉండును. కాని దాని విత్తనమును చూస్తే ఎంతో చిన్నది. అలాగే మంచిమనసుతో చేసిన పుణ్యం బహు చిన్నదిగా తక్కువదిగా తలపోయరాదు. సద్బుద్ధితో చేసినది చిన్నదైనా, పెద్దదైనా ఉన్నత ఫలితమునే కలిగించును.

***ఉత్తమ పనుల విశిష్టతను గురించి తెలుపుతుంది.***

*ఆ.* *గంగిగోవుపాలు గంటెడైనను చాలు*
*కడివెడైననేమి ఖరముపాలు*
*భక్తికలుగు కూడు పెట్టెడైననుజాలు,*
*విశ్వదాభిరామ వినురవేమా.* ***6***

***తా.*** పనికిరానివి ఎన్ని ఉన్నా వ్యర్థమే అయినట్లు గాడిద పాలు కుండలకొద్ది ఇచ్చిన వృథాయే! అదే శ్రేష్టమైన ఆవుపాలు చిన్న గరిటెడు తాగిన ఆరోగ్యము శ్రేష్టముగా నుండును. అలాగే ప్రేమతో పెట్టినదేదైనా పిడికెడైనా చాలు. అదియే ఆనందము.

***అల్పుని, ఉన్నతుని గుణముల అంతర్యమును వివరించుట.***

***ఆ. అల్పుడెపుడు పల్కు నాడంబరముగాను***
***సజ్జనుండుఁబల్కుఁజల్లగాను***
***కంచుమ్రోగునట్లు కనకంబు మ్రోగునా***
***విశ్వదాభిరామ వినురవేమా. 7***

**తా.** తక్కువ విలువ కలిగిన కంచు ఎక్కువ శబ్దము చేయును. కాని ఎక్కువ విలువ కలిగిన బంగారము తక్కువ శబద్దము చేయును. అలాగే అల్పబుద్ధి కలిగినవాడు లేనిపోని డాంభికాలు చెప్పుకొనుచు ఎక్కువగా మాటలాడును. ఉత్తముడు తనకున్న గొప్పతనమును దాచి ఉంచి, అందరితోను మధురముగా మాటలాడును.

***దుష్టగుణ ప్రభావము తెలుపుతుంది.***

***ఆ. వేరుపురుగు చేరి వృక్షంబుజెఱచును***
***చీడ పురుగు జేరి చెట్టుఁజెఱచుఁ***
***కుత్సితుండుచేరి గుణవంతుఁజెఱచురా***
***విశ్వదాభిరామ వినురవేమా. 8***

**తా.** దుర్బుద్ధి కలిగినవాడు గుణవంతునితో కలిసిన అతనిని కూడా నాశనము చేసి చెఱచును. ఎలాగైతే వేరును నాశనం చేసే పురుగు చెట్టులో ప్రవేశించి ఆ చెట్టును నశింప చేస్తుందో.



***అర్ధము చేసుకోలేని చదువు వ్యర్థము అని దీని అర్ధము.***

***ఆ. చదివి చదివి కొంత చతువంగ చదువంగ***
***చదువు చదివి యింకఁ జదువు చదివి***
***చదువు మర్మములను చదువలేదయ్యేను***
***విశ్వదాభిరామ వినురవేమా. 9***

**తా.** ఎంతకాలం ఎన్ని చదువులు చదివిననూ, చదువులలోని మర్మము ఆత్మతత్త్వము తెలియకపోతే ఆ చదువులన్నియు ఎందుకూ పనికిరావు. అనగా నిరర్ధకములని అర్ధము.

***అందరిలో తప్పలు వెతకుంట కంటే తనలో ఉన్న తప్పలను తెలుసుకొనుట ముఖ్యము.***

***ఆ. తప్పులెన్నువారు తండోప తండంబు***
***లుర్విజనులకెల్ల నుండు దప్పు***
***తప్పులెన్నువారు తమతప్పులెరుగరు***
***విశ్వదాభిరామ వినురవేమా. 10***

**తా.** లోకములోని ఆచారము ఏమిటంటే ప్రతివారు ఎదుటి వ్యక్తిలో ఈ దోషముంది ఆ దోషముంది అని ఎంచుతారు. కానీ తమలోని తప్పులను మాత్రం తెలుసుకోలేరు, గ్రహించలేరు, గుర్తించలేరు.

***భగవంతుడు సర్వాంతర్యామి లని తెలుపుతుంది.***

***అ.*** ***అంతరంగమందు నపరాధములు చేసి***
***మంచి వానివలెనె మనుజుడుండు***
***ఇతరులెఱుగకున్న నీశ్వరుడెఱుగడా?***
***విశ్వదాభిరామ వినురవేమా.*** ***11***

**తా.** మనసులో ఎన్నో తప్పులను చేసి పైకి మాత్రం మంచివాడిగా నటిస్తూ అందరూ తనని మంచివాడిగా అనుకొంటున్నారనే భ్రమలో మనిషి బ్రతికినంత మాత్రానా సర్వాంతర్యామి అయిన భగవంతుని దగ్గర ఈ మనిషి జాతకము ఉండకపోతుందా? ఆయనకు అన్ని విషయాలు తెలియపోతాయా?

***ఎక్కడ ఎలా ప్రవర్తించాలో అలా ప్రవర్తించితే మంచిది అని తెలుపుతుంది.***

***ఆ.*** ***అనువుగానిచోట నధికుల మనరాదు.***
***కొంచమైన నదియుఁ గొదువగాదు***
***కొండ యద్ధమందుఁ గొంచెమైయుండదా!***
***విశ్వదాభిరామ వినురవేమా.*** ***12***

**తా.** ప్రతికూలముగా ఉన్న చోటన నేను గొప్పవాడినని డాంభికాలు పోవటం తగదు. దాని వలన లేనిపోని అవమానాలు, అపనిందలు కలుగును. అందుకే ఒదిగి ఉండటం మంచిది. ఒదిగి ఉన్నంత మాత్రాన గొప్పతనము తగ్గిపోదు. కొండను అద్దములో చూసినపుడు చిన్నదిగానే కనిపిస్తుంది కదా! అయినా అది గొప్పది కాకుండా పోతుందా?



***నీచునికి అధికారమిస్తే ఏమవుతుందో చెబుతున్నారు.***

***అ.*** ***అల్పజాతి వాని కధికారమిచ్చిన***
***దొడ్డవారినెల్ల దొలగఁజేయు***
***జెప్పుందినెడుకుక్క చెఱకుతీపెరుగునా?***
***విశ్వదాభిరామ వినురవేమా.*** ***13***

**తా.** నీచుడు గొప్పవారి బుద్ధిని గ్రహించగలడా! అటువంటివాడికి అధికారమిచ్చినచో వారిని పదవిలో ఉండనిచ్చునా? వీడి వ్యవహారము అంతయు కుక్క చెప్పు తిననట్లుగానే ఉంటుంది. కాబట్టి నీచులను దగ్గరికి చేరదీయ కూడదు.

***తన శాంతమే తనకు రక్ష అని తెలుపుట.***

***ఆ.*** ***కోపమునను ఘనత కొంచమైపోవును***
***కోపమునను మిగులఁగోడు గల్గు***
***కోపమడచెనేని కోర్కెలీడేరు***
***విశ్వదాభిరామ వినురవేమా.*** ***14***

**తా.** తన కోపమే తనకు హాని కలిగించును. తన శాంతమే తనకు రక్ష. అను లోకోక్తిని అనుసరించి ఎంత గొప్పవాడయినను వ్యక్తి తన కోపమును తగ్గించుకోననిచో అతని గొప్పతనము అంతా నశించును. శాంతముచేతనే సర్వకార్యములు నెరవేరును.

***ఎటువంటి పరిస్థితులలోను ఇతరుల మనసు గాయపరచకూడదు అని తెలుపుతుంది.***

**అ.** **ఇనుము విరిగెనేని యినుమారు ముమ్మారు**
**కాల్చి యతుకవచ్చు క్రమముగాను**
**మనసు విరిగెనేని మరికూర్ప వచ్చునా**
**విశ్వదాభిరామ వినురవేమా.** ***15***

**తా.** ఇతరులను ఎప్పుడు అకారణముగా మాటలాడకూడదు. అలా చేయుట వలన వారి మనసు గాయపడితే అది అతకడం చాలా కష్టము అవుతుంది. హృదయము ఇనుపకమ్మి కాదు విరిగితే అతికించుకోవటానికి అందుకే ఇతరుల పట్ల శ్రద్ధతో ప్రవర్తిచవలసి ఉంది.